ADMISSIONS ARE IN PROGRESS 2024-25
Secretary & Correspondent
Bikki Venkateshwarlu
M.Sc (Physicis), M.Ed.
Join your kids with us & Empower their Academic Excellence with Ethical Foundations
INDIRA VIDYALAYA
Nursery to VII class, English Medium
Near Bodrai, Mahabubabad.
Cell: 9701912300, 9705412300

దిన పత్రిక
# తొలి సమయం
వాస్తవమే గమ్యం.. గమనం...

సంపుటి : 01 సంచిక : 271 బుధవారం 25-9-2024 | ఎడిటర్ : వేముల అయోధ్య రాములు | పేజీలు : 4 | వెల : 5 రూ/..

## శ్రీలంక నూతన ప్రధానిగా హరిణి అమరసూర్య

### సిరిమావో తరవాత రెండో మహిళా ప్రధాని



**కొలంబో,సెప్టెంబర్ 24:** శ్రీలంక నూతన ప్రధానిగా హరిణి అమరసూర్య నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం ఆమె ప్రమాణస్వీకారం చేశారు. సిరిమావో బండారు నాయకే (1994–2000) తర్వాత శ్రీలంకలో ప్రధాని పదవి చేపట్టిన మహిళా నేత హరిణి కావడం విశేషం. నేషనల్ పీపుల్స్ పవర్ కి చెందిన 54 ఏళ్ల హరిణి అమరసూర్యతో ఆ దేశాధ్యక్షుడు అనుర కుమార దిసనాయకే ప్రమాణ స్వీకారం చేయించారు. అలాగే, మరో ఇద్దరు నేతలను క్యాబినెట్ మంత్రులుగా నియమించారు. దీంతో శ్రీలంకలో దిసనాయకేతో పాటు మొత్తం నలుగురితో కూడిన క్యాబినెట్ కొలువుదీరింది. ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన హరిణికి న్యాయ, విద్య, కార్మిక, పరిశ్రమలు, శాస్త్ర సాంకేతిక శాఖ, ఆరోగ్యం, పెట్టుబడులు వంటి కీలక శాఖలను కేటాయించారు. అధ్యక్ష ఎన్నికల అనంతరం అధికార మార్పిడిలో భాగంగా దినేష్ గుణవర్ధన తన ప్రధాని పదవికి నిన్న రాజీనామా చేసిన నేపథ్యంలో తాజా పరిణామం చోటుచేసుకుంది. శ్రీలంకలో హక్కుల కార్యకర్తగా, యూనివర్సిటీ అధ్యాపకురాలిగా గుర్తింపు పొందిన హరిణి ఆ దేశ మూడో మహిళా ప్రధానిగా చరిత్ర లిఖించారు. మరోవైపు, ఎన్‌పీపీకి చెందిన ఎంపీలు విజిత హెరాత్, లక్ష్మణ్ నిపుణరచిచి క్యాబినెట్ మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. ఇటీవల జరిగిన శ్రీలంక అధ్యక్ష ఎన్నికల్లో దిసనాయకే సంచలన విజయం సాధించి శ్రీలంక నూతన అధ్యక్షుడిగా పగ్గాలు చేపట్టిన విషయం తెలిసిందే. ప్రస్తుత పార్లమెంట్‌ను రెండు రోజుల్లో రద్దు చేస్తామని ఆయన సోమవారం వెల్లడించడంతో శ్రీలంకలో ముందస్తు పార్లమెంటు ఎన్నికలు నవంబర్‌లో జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## ప్రధాని మోడీ అమెరికా పర్యటన విజయవంతం

### ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపిన బాబు

**అమరావతి,సెప్టెంబర్ 24:** అమెరికా పర్యటన ముగించుకున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ భారత్‌కు తిరిగివస్తున్నారు. ఈ సందర్భంగా ఏపీ సీఎం చంద్రబాబు ఆయనకు 'ఎక్స్' వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. 'విజయవంతంగా అమెరికా పర్యటన ముగించుకొని భారత్‌కు విచ్చేస్తోన్న ప్రధాని మోదీకి స్వాగతం. ఆయనలాంటి గొప్ప రాజనీతిజ్ఞుడి నాయకత్వంలో పనిచేయడం నా అదృష్టంగా భావిస్తున్నా. ప్రపంచంలో భారత్ స్థానాన్ని బలపరచడంతోపాటు ప్రపంచ నాయకుడిగా ఎదిగారు. దేశాలను, జాతులను ఐక్యం చేయడంలో ప్రధాని కృషి ప్రశంసనీయం. ఐక్యరాజ్య సమితిలో ప్రధాని ప్రసంగం.. రాబోయే రోజుల్లో ప్రపంచవేదికపై మనం పోషించబోయే పాత్రకు సాక్ష్యంగా నిలుస్తోంది'అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# మూసీ నిర్వాసితులకు డబుల్ ఇళ్లు

• జీవో విడుదల చేసిన ప్రభుత్వం • నిర్మాణాలకు నష్టపరిహారం చెల్లింపు • అధికారులతో సీఎం రేవంత్ సమీక్ష

**హైదరాబాద్,సెప్టెంబర్ 24:** హైదరాబాద్ మూసీ అభివృద్ధి ప్రాజెక్టులో నిర్వాసితులకు 16,002 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మూసీలో 10,200 మంది నిర్వాసితులు కానున్నట్లు ఇప్పటికే అధికారులు గుర్తించారు. బుధవారం ఇంటింటికి వెళ్లి ఇళ్ల కేటాయింపు వివరాలను నిర్వాసితులకు తెలియజేయనున్నారు. మరోవైపు రివర్ బెడ్ ఆక్రమణలో ఉన్న 1,600 ఇళ్లను అధికారులు తొలగించనున్నారు. మూసీ బఫర్ జోన్‌లో నివసించే వ్యక్తులు, నిర్మాణాలకు పరిహారం చెల్లించనున్నారు. ఈ క్రమంలో చెరువులు, నాలాల ఆక్రమణల తొలగింపుపై సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్, మెట్రో రైలుపై సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.. ఆక్రమిత చెరువులు, నాలాలతోపాటు మూసీ పరివాహక ప్రాంతాల్లో నివసించే పేదల వివరాలు సేకరించాలని, వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు లేదా ప్రత్యామ్నాయం చూపించాలని ఆదేశించారు. ఔటర్ రింగ్‌రోడ్డు లోపల ఉన్న చెరువుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని, ఆక్రమణలకు గురి కాకుండా పర్యవేక్షించేందుకు చెరువుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మూసీ ఒడ్డున కూల్చివేతలకు ప్రభుత్వం యాక్షన్ ప్లాన్ షురూ చేసింది. యాక్షన్ ప్లాన్ పై సమీక్షలో ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, జీహెచ్ఎంసీ కమిషనర్ అమ్రపాలి పలువురు అధికారులు భేటీ అయ్యారు. మూసీపై 13వేల అక్రమ



నిర్మాణాలు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. మూసీ నివాసితులకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. మూసీని ఆక్రమించి ఉన్న నిర్మాణాల తొలగింపు బాధ్యత హైడ్రాకు అప్పగించింది. ఈ క్రమంలో.. కూల్చివేతల సందర్భంగా నివాసితులు నుంచి వ్యతిరేకత రాకుండా ముందస్తు కార్యాచరణ చేపట్టింది అధికార యంత్రాంగం. ప్రభుత్వం పూర్తి స్థాయి భరోసా కల్పించిన తర్వాత.. హైడ్రా బుల్డోజర్లు రంగంలోకి దిగనున్నాయి. కాగా.. నగరంలో అక్రమ కట్టడాల కూల్చివేతలే లక్ష్యంగా హైడ్రా దూసుకెళ్తోంది. ఇప్పటికే పలుచోట్ల అక్రమ నిర్మాణాలను హైడ్రా కూల్చివేసింది.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో స్పెషల్ టీమ్‌తో విచారణ

### ప్రభాకర్ రావు,శ్రవణ్ రావుకు రెడ్ కార్నర్ నోటీసులు

### డిజె సౌండ్లతో నగరంలో తీవ్ర శబ్దకాలుష్యం

### మావోల ప్రభావం అంతంతమాత్రమేనన్న డిజిపి

**హైదరాబాద్,సెప్టెంబర్ 24:** ఫోన్ ట్యాపింగ్ కేసులో స్పెషల్ టీమ్‌తో విచారణ చేస్తున్నామని,కోర్టు పరిధిలో ఉన్నందున ఈ విషయంపై తాను కామెంట్ చేయలేనని డీజీపీ జితేందర్ అన్నారు. ట్యాపింగ్ కేసుపై మంగళవారం జితేందర్ మీడియాతో మాట్లాడారు. ట్యాపింగ్ కేసు కోర్టు పరిధిలో ఉన్నందున నేను కామెంట్ చేయలేను. ప్రభాకర్ రావు,శ్రవణ్ రావుకు రెడ్ కార్నర్ నోటీసు ఇవ్వడానికి కొంత సమయం పట్టింది.రెడ్ కార్నర్ నోటీసుల కోసం ఇంటర్ పోల్‌కి లేఖ రాశాం.సీబీఐకి రాగానే రెడ్ కార్నర్ నోటీస్ జారీ అవుతుందని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ కేసును స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్) దర్యాప్తు చేస్తోందని తెలిపారు. హైదరాబాద్ సీపీ, వెస్ట్ జోన్ డీసీపీ విచారణ చేస్తున్నారన్నారు. ఈ కేసులో కీలక నిందితులుగా ఉన్న ప్రభాకర్‌రావు, శ్రవణ్‌రావులను విదేశాల నుండి ఇండియా తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు.ప్రభాకర్‌రావు, శ్రవణ్‌రావు రావులకు రెడ్ కార్నర్ నోటీసు ఇష్యూ చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. రెడ్ కార్నర్ నోటీస్ ప్రస్తుతం సీబీఐ వద్ద ప్రాసెసింగ్‌లో ఉందన్నారు. రెడ్ కార్నర్ నోటీస్ అనేది చాలా పెద్ద ప్రొసీజర్ అని, ఇంటర్నేషనల్ ఏజెన్సీలతో కలిసి పనిచేయాల్సి ఉంటుందన్న డీజీపీ.. నిందితులకు రెడ్ కార్నర్ నోటీస్ ఇష్యూ చేసేందుకు ఇంకా కొంత సమయం పడుతోందని తెలిపారు. కాగా, గత బీఆర్ఎస్ హయాంలో ప్రతిపక్ష నేతలు, వ్యాపారస్తులు, బిల్డర్లు, సెలబ్రెటీల ఫోన్ ట్యాపింగ్ జరిగిందన్న ఆరోపణలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తోన్న విషయం తెలిసిందే. రాష్ట్ర రాజకీయాలను కుదిపేసిన ఈ కేసును సిట్ దర్యాప్తు చేస్తోంది. ఈ కేసులో కీలక నిందితులను ఇప్పటికే పోలీసులు అరెస్ట్ చేశారు.నగరంలో ఇటీవల గణేష్ నిమజ్జనం, మిలాద్ ఉన్ నబి ఉత్సవాలు విజయవంతంగా పూర్తిచేశామని డీజీపీ జితేందర్ తెలిపారు. పోలీస్ సిబ్బందికి కృతజ్ఞతలు, శుభాకాంక్షలు చెప్పారు. నిమజ్జనం కోసం అన్ని శాఖలు సమన్వయంతో కలిసి పనిచేశాయన్నారు.ట్రైనీ ఎస్సైలు , కానిస్టేబుళ్లు 12వేల మంది సిబ్బంది పాల్గొన్నారని చెప్పారు. గణేష్ ఉత్సవాల్లో డీజేల ఏర్పాటు, శబ్ద కాలుష్యం కొంత నగర వాసులను ఇబ్బంది పెట్టిందన్నారు. డీజేల విషయంలో త్వరలో మార్గదర్శకాలు విడుదలచేస్తామని చెప్పారు. వినికిడి సమస్యలు వచ్చే ప్రమాదం ఉన్నందున జాగ్రత్త వహించాలని డీజీపీ సూచించారు. ఇక, తెలంగాణ చుట్టుపక్క రాష్ట్రాల్లో మావోయిస్టు ప్రాబల్యం ఉందని.. నక్సల్స్ కట్టడికి పూర్తి ప్రయత్నాలు చేస్తున్నామని వెల్లడించారు.

## అమృత్ టెండర్లపై వదిలిపెట్టేది లేదు

- ప్రాజెక్టుల టెండర్ల పేరుతో కుట్రలకు తెర

- ముడుపులు వచ్చే పనులపై రేవంత్ దృష్టి - ప్రకటన విడుదల చేసిన మాజీమంత్రి కెటిఆర్



**హైదరాబాద్,సెప్టెంబర్ 24:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారంలోకి రాగానే భారీగా ముడుపులు వచ్చే కార్యక్రమాలపైన దృష్టి పెట్టారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్లకుంట్ల తారక రామారావు ఆరోపించారు. అమృత్ టెండర్లపై మరోమారు కేటీఆర్ విమర్శలు చేశారు. ఈ మేరకుమంగళవారం ప్రకటన విడుదల చేశారు. మౌలిక వసతుల ప్రాజెక్టుల టెండర్ల పేరుతో కుట్రకు తెర లేపారని ఆరోపణలు చేశారు. అధికారంలోకి వచ్చిన ఒకటి రెండు నెలల్లోనే తాను గతంలో బాధ్యతలు నిర్వహించిన మున్సిపల్ శాఖలో సీఎం రేవంత్ వివిధ పనులకు టెండర్లు పిలిచారని అన్నారు. 26 పురపాలక పట్టణాల్లో తాగునీటి ప్రాజెక్టులు సీవరేజ్ పనులకు సుమారు 9000 కోట్ల రూపాయల టెండర్లు పిలిచారని తెలిపారు. ఈ సంవత్సరం ఫిబ్రవరి 6వ తేదీన టెండర్ల గడువు పక్రియ పూర్తయిందని కేటీఆర్ పేర్కొన్నారు.ఈ టెండర్లలో సీఎం రేవంత్‌కు సంబంధించిన కంపెనీలను దొడ్డి దారిన ప్రవేశపెట్టి పనులు అప్పగించారు. అందుకే ఈ మొత్తం వ్యవహారం తాలూకు సమాచారాన్ని ప్రభుత్వం ఏ వెబ్‌సైట్లోనూ ఉంచలేదు. ఇన్ని వేల కోట్ల రూపాయల ప్రాజెక్టు పనుల టెండరింగ్ పక్రియ పూర్తి అయిన ఇప్పటిదాకా ప్రభుత్వం నుంచి ఒక్క పత్రిక ప్రకటన కూడా రాలేదు. ఏయే ప్రాంతాల్లో పనులను పిలిచారు. ఎక్కడ ఏ ఏ కంపెనీలకు టెండర్లు దక్కాయి. టెండర్ పనుల విలువ వంటి ఏ సమాచారాన్ని కూడా ప్రభుత్వం ప్రజలకు అందుబాటులో ఉంచలేదు. అయితే టెండర్లు దక్కించుకున్న ఇండియన్ హ్యూమ్ పైప్ కంపెనీ స్టాక్ లిస్టెడ్ కంపెనీ కావడంతో... వారికి దక్కిన టెండర్ల తాలూకు సమాచారాన్ని సెబీకి ఇవ్వాల్సి వచ్చింది. దీంతో ఈ టెండర్ల స్కామ్ బయటకు వచ్చింది. ఈ కంపెనీ సెబీకి ఇచ్చిన సమాచారం ప్రకారం రూ.1137 కోట్ల టెండర్లను సంస్థ దక్కించుకుంది అని కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. ఈ టెండర్లలో 80శాతం పనులను మరో రెండు కంపెనీలకు జాయింట్ వెంచర్ రూపంలో ఇస్తున్నట్లు తెలిపింది. ఈ రెండు కంపెనీల్లో ఒక కంపెనీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి స్వయానా బావమరిది సూదిని సృజన్ రెడ్డి సంస్థ అయిన శోధా కన్స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ అనే ఈ కంపెనీకి ఈ జాయింట్ వెంచర్‌లో భాగస్వామ్యం ఉంది. ఈ కంపెనీకి ఎలాంటి అర్హతలు లేకపోవడంతో నేరుగా టెండర్లలో పాల్గొనలేదు. ఈ ఇండియన్ హ్యూమ్ పైప్ కంపెనీపైన ఒత్తిడి తీసుకువచ్చి టెండర్లు వేయించి అందులో 80? పనులను ముఖ్యమంత్రి బావమరిది ఆయన బినామీ కంపెనీలకు అప్పచెప్పారు. ఈ శోధా కన్స్ట్రక్షన్ కంపెనీకి ఆర్థిక సామర్థ్యం కూడా లేదు. ఈ కంపెనీ రెవెన్యూ ఏడాదికి కేవలం రూ.71 కోట్లు మాత్రమే, రూ. 2 కోట్లు మాత్రమే లాభం కలిగిన ఈ కంపెనీ ఇన్ని వందల కోట్ల రూపాయల ప్రాజెక్టు ను ఎలా పూర్తి చేస్తుంది. ప్రభుత్వం నిర్ణయించిన అర్హతలు లేకపోవడంతో నేరుగా టెండర్లలో పాల్గొనని ఈ కంపెనీ దొడ్డిదారిన అవే పనులను చేపట్టడం సరైనది కాదని కేటీఆర్ తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన అధికారాన్ని అడ్డుపెట్టుకుని తన కుటుంబ సభ్యులకు వందల కోట్ల రూపాయల టెండర్‌ను కట్టబెట్టడం ముమ్మాటికి ప్రివెన్షన్ ఆఫ్ కరప్షన్ చట్టం ప్రకారం శిక్షార్హమైన నేరం.

## ఎడమకాల్వ గండ్లు త్వరగా పూర్తి చేయండి

### పనుల ఆలస్యంపై మంత్రి ఉత్తమ్ ఆగ్రహం



**సూర్యాపేట,సెప్టెంబర్ 24:** నాగార్జున సాగర్ ఎడమ కాల్వ మరమ్మతు పనుల్లో జాప్యంపై నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సీరియస్ అయ్యారు. ఇంకా ఎన్నిరోజులు చేస్తారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పనుల్లో నిర్లక్ష్యాన్ని సహించబోమని చెప్పారు. పనుల్లో జాప్యానికి కారణమైన ఇంజినీర్లపై ఎందుకు చర్యలు తీసుకోవద్దో తెలుపాలన్నారు. ఇటీవల వచ్చిన వరదలకు సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం కాగితపు రామచంద్రాపురం వద్ద నాగర్జున సాగర్ ఎడమ కాలువకు గండిపడింది.గండి పూడ్చివేత పనులు గత వారం ప్రారంభమయ్యాయి ఆ పనులు ఇప్పటికే పూర్తి కావాల్సి ఉండగా.. ఆ పనులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి.. గండిపూడ్చివేత పనులు జరుగుతున్న తీరును పరిశీలించిన మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత అధికారుల నిర్లక్ష్యం వల్లే గండి పూడ్చివేత పనులు ఆలస్యం అవుతున్నాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. ఇప్పటికైనా పనులు త్వరతగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

## వైసిపికి మరో బిగ్ షాక్

### రాజ్యసభకు ఆర్. కృష్ణయ్య రాజీనామా



**హైదరాబాద్,సెప్టెంబర్ 24:** వైసీపీకి మరో బిగ్ షాక్ తగిలింది. రాజ్యసభ సభ్యత్వానికి వైసీపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను సోమవారం రాజ్యసభ ఛైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్‌కు అందజేయగా.. రాజీనామాను ఆమోదిస్తున్నట్లు రాజ్యసభ ఛైర్మన్ మంగళవారం ప్రకటించారు. ఆర్ కృష్ణయ్య స్థానం ఖాళీ అయిందంటూ రాజ్యసభ సెక్రటరీ బులిటెన్ విడుదల చేశారు. పదవీకాలం ఇంకా నాలుగేళ్లు ఉండగానే ఆర్.కృష్ణయ్య రాజీనామా చేయడం గమనార్హం. ఇటీవలే వైసీపీ రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు, మోపిదేవి వెంకటరమణలు తమ రాజ్యసభ సభ్యత్వాలకు రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. రాజ్యసభలో గతంలో 11మంది వైసీపీ తరఫున ఎంపీలు ఉండగా.. మొత్తం ముగ్గురు రాజీనామాలు చేశారు.ముగ్గురు రాజీనామా చేయడంతో వైసీపీ రాజ్యసభ ఎంపీల సంఖ్య 8కి పడిపోయింది.

# మతోన్మాద పాసిష్టు శక్తుల నుండి దేశాన్ని కాపాడుకుందాం

## సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు కామ్రేడ్ మండల వెంకన్న




**తొలి సమయం మహబూబాబాద్ సెప్టెంబర్ 24 :** మతోన్మాద పాసిష్టు శక్తుల నుండి దేశాన్ని కాపాడుకుందాం అని బ్రాహ్మణీయ హిందూ పాసిష్ట కూలో న్మాద దాడులకు హత్యలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని సిపిఐ ఎమ్మెల్యే సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు కామ్రేడ్ మండల వెంకన్న పిలుపునిచ్చారు జ్యోతిరావు బాపూ లే స్థాపించిన సత్య శోధక్ 152 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కుల నిర్మూలన ఆచరణాత్మక కార్యక్రమాల వారోత్సవం లో భాగంగా సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో మహబూబాబాద్ పట్టణంలోని జ్యోతిరావు బాపూ లే విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించడం జరిగింది అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి కామ్రేడ్ మండలం వెంకన్న మాట్లాడుతూ భారతదేశంలో నిచ్చెన మెట్ల లాగా ఉన్న కులవ్యవస్థకు వ్యతిరేకంగా జ్యోతి రావు పూలే సతీసహగమనం వ్యతిరేకంగా, స్త్రీలకు విద్యను అందించాలనే లక్ష్యంతో సావిత్రిబాయి పూలే కు విద్య నేర్పించారు అన్నారు ఆమెను చైతన్య పరిచి క సత్య శోధకఅనే సంస్థను ఏర్పాటు చేసారు అన్నారు కుల నిర్మూలన ఆచరణాత్మక కార్యక్రమాలను పూలే ముందుకు తీసుకొచ్చి అనేక చైతన్యవంతమైన కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది అన్నారు నేడు మనదేశంలోని బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కులం పేరుతో మతం పేరుతో ఎస్సీ ఎస్టీ మైనారిటీ బీసీల పై దాడులు హత్యలు వారికి అండగా ఉన్న రచయితలు విలేకరులు మేధావుల పై హత్యలు దాడులు జరుగుతున్నాయని అన్నారు తినే తిండి పై ఆంక్షలు ఇలాంటి అనేక సమస్యలపై ప్రశ్నించే వాళ్లను అర్బన్ నక్సల్స్ పేరుతో కేసులు పెట్టి జైల్లో నిర్బంధించడం లాంటి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పూలే స్థాపించిన సత్య శోధక్ స్ఫూర్తితో హిందూ మతోన్మాద దాడులకు వ్యతిరేకంగా కులోన్మాదానికి వ్యతిరేకంగా కుల నిర్మూలనకై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి కామ్రేడ్ హాలావత్ లింగన్న డివిజన్ నాయకులు సామ పాపయ్య తెలబోయిన లక్ష్మయ్య పర్వత కోటేష్ ఎండి జబ్బర్ పట్టణ నాయకులు తెలబోయిన కృష్ణ కుక్కమూడి యాకయ్య నూకల మురళి ఎండి కవిత కళ్యాణి అల్లి ఆకాంరం కందుకూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

# రైతుల సమస్యను పరిష్కారం చేస్తానన్న ఇరిగేషన్ అధికారులు జాప్యం చేస్తున్నారు

**రానున్న వర్షం భయం తో ఇబ్బందులు పడుతున్న రైతుల పంటలను ముంపుకు గురి కాకుండా కాపాడాలి**

**బఫర్ జోన్ వరద కాలువను ఆక్రమించుకొని రైతులను ఇబ్బందులు పెడుతున్న పెదు సర్పంచ్ పట్నం శెట్టి నాగరాజు పై వెంటనే చర్యలు తీసుకోవాలి**





**సమయం మహబూబాబాద్ సెప్టెంబర్ 24 :** బఫర్ జోన్ వరద కాలువను ఆక్రమించుకొని మాజీ సర్పంచ్ పట్నం శెట్టి నాగరాజు రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని మునిగిల వీడు రైతులు ఇటీవల ఇరిగేషన్ ఏఇ,ఈడీ లకు కంప్లైంట్ చేశారు.. ఫీల్డ్ మీదికి వెళ్లి విషయాన్ని గ్రహించిన ఏ ఈ.. పట్న శెట్టి నాగరాజు కాలువ మత్తడి దగ్గర బఫర్ జోన్ ను ఆక్రమించుకోవడం వలన రైతులు పడుతున్న ఇబ్బందులకు గురిచేయడాన్ని ప్రత్యేక్షంగా గమనించారు,వెంటనే చర్యలు తీసుకుంటానని ఏఇ హామీ ఇచ్చారు. కానీ తీవ్రమైన జాప్యం చేస్తున్నందున రైతులు ఇబ్బందులు పడుతున్నారు... వివరాలు లోకి వెళితే... మునిగేలవేడు గ్రామంలోని గుండు కుంట కట్ట పరిధిలో డ్యామేజ్ జరిగింది. ఈ డ్యామేజీ కి కారణం.బఫర్ జోన్ వరద కాలువను అక్రమంగా మాజీ సర్పంచ్ పట్నం శెట్టి నాగరాజు ఆక్రమించుకున్నారు.. ఇలా ఆక్రమించడం వల్ల సహజ సిద్ధంగా వెళ్లిపోయే వరద పక్క రైతుల పంట పొలాలను నాశనం చేస్తోందని రైతులు వాపోతున్నారు పక్కన ఉన్న రేగడి పొలంలోకి వరద రావడం వలన పంటకు నష్టం జరిగిందని ఓ రైతు వాపోతున్నారు.. మరొకసారి శనివారం పట్న శెట్టి నాగరాజు తన పొలంలో గండ్లు పడ్డాయనే సాకుతో రెండు ట్రాక్టర్ ట్రిప్పులు మట్టిని మత్తడి యొక్క స్ట్రీమ్ పరిధిలో డంపు చేశారు.. పూడ్చు కోవడానికి మట్టిని తెచ్చిన మట్టి అక్కడే ఉండడం వలన రైతులకు ఇబ్బందిగా ఉన్నది అనేది రైతుల అభిప్రాయం, అదేవిదంగా. సర్పంచ్ పట్నం శెట్టి నాగరాజు నీటి సంఘం చైర్మన్ గా పనిచేశారు కనుక ఆ శాఖలో అధికారులతో పరిచయం ఉన్నందున వారిని అడ్డం పెట్టుకొని ఈ తప్పుడు పనులు చేస్తున్నాడని ఆరోపిస్తున్నారు,కనుక ఉద్దేశ్య పూర్వకంగా రైతుల పంటలకు ఇబ్బందులు కలుగ జేస్తున్నా మాజీ సర్పంచ్ పై చర్యలు తీసుకొని బఫర్ జోన్ సమస్యను అధికారులు పరిష్కరించాలని రైతులు కోరుకుంటున్నారు..ఇదే కధానం గతం లో తొలి సమయం దిన పత్రికలో ఒచ్చింది కనుక వెంటనే అధికారులు స్పందించి రానున్న భారీ వర్షాలకు పంట పొలాలు ముంపుకు గురి కాకుండా యుద్ధ ప్రాతిపదికగా చర్యలు తీసుకోవాలని కోరుకుంటున్నారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న రైతులు సోమయ్య నాగేష్ రమేష్ రామయ్య యాదగిరి డి కృష్ణ ఈ రమేష్ బీరయ్య తదితరులు పాల్గొన్నారు.

# దామగుండం అడవిని కాపాడుకుందాం

## - ప్రకృతి వైపరీత్యాలు జరగకుండా అడవులను రక్షించుకుందాం - డిఎస్ఎ రాష్ట్ర కన్వీనర్ శ్రవణ్ పిలుపు.




**తొలి సమయం మహబూబాబాద్ సెప్టెంబర్ 24:** దేశ భద్రత పేరుతో ఇండియన్ నేవీ దామగుండం రిజర్వ్ అడవుల్లో లో ఫ్రీక్వెన్సీ రాడార్ స్టేషన్ ను ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ ఈరోజు హన్మకొండలోని అశోక జంక్షన్ వద్ద డెమోక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన తెలియచేసారు. ఈ నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ ఆ సంఘ రాష్ట్ర కన్వీనర్, కో కన్వీనర్లు శ్రావణ్, గణేష్ లు మాట్లాడతూ దాదాపు మూడు వేల ఎకరాల్లో విస్తరించి ఉన్న దామగూడెం అడవిలో వన్య ప్రాణులు, ఔషధ మొక్కలతో పాటు కొన్ని లక్షల చెట్లు ఉన్న ఈ దామగుండం రిజర్వు ఫారెస్ట్ భూములను నరికి వేస్తూ ఆ స్థలంలో ఇండియన్ నేవికి చెందిన లోఫ్రీక్వెన్సీ రాడార్ స్టేషన్ ను ఏర్పాటు చేయడం వలన ఆ ప్రాంతంలో పర్యావరణం దెబ్బ తీనడమే కాకుండా, ఆ అడవిని నమ్ముకొని జీవిస్తున్న ప్రజలు ఉపాధిని కోల్పోతారని, ఒక వైపు దేశంలోని ఢిల్లీ లాంటి రాష్ట్రాలు కాలుష్యం వల్ల తీవ్ర అనారోగ్యానికి శ్వాస సంబంధిత వ్యాధిలకు గురౌతున్న ఈ తరుణంలో అడవులను పెంచడం పక్కన బెట్టి ఉన్న సహజమైన వైవిధ్యమైన అడవులను నరికి వేస్తూ రాడార్ స్టేషన్ నిర్మించడం అనేది ప్రజా వ్యతిరేక చర్య అని, అభివృద్ధి చెందిన అమెరికా చైనా, దుబాయ్ లాంటి ఇతర దేశాలు ఎడారులను సైతం ఆడవులుగా మారుస్తుంటే కేవలం మన దేశంలో మాత్రం అందుకు భిన్నంగా అడవులను నాశనం చేస్తున్నారని, ఇలాంటి ప్రాజెక్టులును ప్రజలు, సైంటిస్టులు, ప్రకృతి ప్రేమికులు వ్యతిరేకించిన ప్రతి సారి ఇది దేశ భద్రతకు సంబంధించిన విషయం అని మొత్తం సమస్యనే పక్క దారి పట్టిస్తున్నారని, వందల ఎకరాల అడవిని లక్షల చెట్లను నరికి దానికి కంపెన్సేషన్ కింద మొక్కలు నాటుతాం అని నేవీ అధికారులు అనడం హాస్యాస్పదంగా ఉందని, ఒక మొక్క వృక్షంగా మారడానికి కొన్ని ఏళ్లు పడుతుందని, వారు పెట్టె ఆ చెట్లు అడవిగా మారడానికి వందల ఏళ్లు పట్టొచ్చని , నేవీ అధికారులు పెట్టే ఆ చిన్న చిన్న శోకేజ్ మొక్కలు నిజంగా కంపెన్సేట్ చేస్తాయా? అని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని అడుగుతున్నామన్నారు. అలాగే ఒకవేళ రాడార్ స్టేషన్ దేశ భద్రతకు సంబంధించిందే ఐతే మరి అక్కడ నిర్మించే రాడార్ స్టేషన్ వల్ల వచ్చే రేడియేషన్ కు గురయ్యే ప్రజలు ఈ దేశస్థులు కాదా? హైదరాబాద్ కు ఆక్సిజన్ ఇచ్చే అడవి ఈ దేశంలో భాగం కాదా? రాడార్ స్టేషన్ ను దేశంలో మరో చోట నిర్మించాలని, సహజ సిద్ధమైన ఈ అడవి అనేది కొన్ని వందల ఏళ్లుగా ఉన్న వట వృక్షాలకు వైవిధ్యానికి ఒక పేరు గాంచిందని, ఒకవైపు రిజర్వ్ ఫారెస్ట్ అని గుర్తిస్తునే అదే రిజర్వ్ ఫారేస్టును నేవీకి అప్పగించడం ఏంటని వారు ప్రశ్నించారు. ఇప్పటికే మన ఇళ్లలో ప్లాస్టిక్ చెట్లను పెట్టుకునే స్థాయికి వెళ్ళామంటే రానున్న రోజుల్లో ప్రకృతిలో జరిగే విధ్వంసాలను గుర్తు చేసుకుంటూ ఇటీవల కేరళ రాష్టంలోని వాయనాడ్ ప్రాంతంలో ప్రకృతి వైపరీత్యం లాంటి ఘటనలు మళ్లీ మళ్లీ జరగకుండా మనం అడవులను, ప్రకృతిని రక్షించుకోవాలన్నారు. అలాగే ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి హన్మకొండ జిల్లా కన్వీనర్ ఉప్పుల శివ, శరత్ లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు అనిల్, అభినయ్, శిరీష,చందన, కళ్యాణి, జయరాం, అభిషేక్, తదితరులు పాల్గొన్నారు.

# కేటీఆర్ కు సీఎం కుర్చీపై ఉన్న సోయి సిరిసిల్ల జనాలపై లేకపోవడం దురదృష్టకరం

## -కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు గాజుల మల్లయ్య గౌడ్



**తొలి సమయం భూపాలపల్లి సెప్టెంబర్ 24:** అధికార దాహం తీరని కల్వకుంట్ల తారక రామారావుకు సీఎం కుర్చీపై ఉన్న సోయి సిరిసిల్ల ప్రజానీకంపై లేకపోవడం దురదృష్టకరమని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు గాజుల మల్లయ్య గౌడ్ అన్నారు. మంగళవారం ఆయన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీ రామారావు కనబడడం లేదంటూ..స్థానిక నియోజకవర్గ ప్రజలే పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసిన విషయాన్ని కేటీఆర్ గమనించాలన్నారు. కేటీఆర్ కు సీఎం రేవంత్ రెడ్డి కుటుంబంపైన విమర్శలు చేసే నైతిక హక్కు లేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి కుటుంబ పాలన, ఫామ్ హౌస్ రాజకీయాలు రావని తెలిపారు. ప్రజాపాలనను అందిస్తున్న రేవంత్ రెడ్డిపై విమర్శలు మానుకుని..నిన్ను నమ్మి ఓట్లు వేసిన సిరిసిల్ల ప్రజలకు సేవ చేసుకోవాలని గాజుల మల్లయ్య గౌడ్ హితవు పలికారు.

# చిన్నారి సాయి శ్రీ తల్లిదండ్రులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర

**తొలి సమయం జయశంకర్ భూపాలపల్లి సెప్టెంబర్ 24:**



జిల్లా మొగుళ్లపల్లి మండలంలోని పాత ఇస్సిపేట గ్రామానికి చెందిన సాయి శ్రీ అనే ఏడేళ్ల అమ్మాయి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. కాగా మంగళవారం మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి ఆ అమ్మాయి తల్లిదండ్రులను పరామర్శించి, ఓదార్చారు. ఆయన వెంట చిట్యాల వ్యవసాయ కమిటీ మాజీ చైర్మన్ కోడారి రమేష్ యాదవ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బల్గూరి తిరుపతిరావు, వరంగల్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ పిన్నింటి వెంకట్ రావు, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు లక్ష్మయ్య, సీనియర్ నాయకులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### జిల్లా కోర్టు పీపీ కవల పిల్లల బర్త్ డే వేడుకలకు

# హాజరైన పల్లవి రాజు నాయక్



**తొలి సమయం హన్మకొండ సెప్టెంబర్ 24:** హనుమకొండ వరంగల్ జిల్లా కోర్టు పిపి కుమారుడు రాజ్ కుమార్ బీజ ఇద్దరు కవల పిల్లల బర్త్ డే లంబాడ ఐక్యవేదిక ప్రెసిడెంట్ క్లాద్య పల్లవి రాజు నాయక్ పాల్గొన్నారు.. హైదరాబాద్ బోడుప్పల్ చిల్కానగర్ వి జె ఆర్ ఫంక్షన్ హాల్లో ఈ జన్మ దిన వేడుకలు ఘనంగా జరిగాయి ఈ వేడుకకు రిటైర్డ్ హెడ్మాస్టర్ లావుడియా శారదా రామ్ నాయక్, రిటైర్డ్ ఆర్ఇసి సూపర్నెంట్ పోరిక శ్యామల నాయక్ లావుగా వనిత గోవర్ధన్ కళ్యాణ్ లావుడియా విజయ హేమ నాయక్ శ్రీకాంత్ శ్రీవిద్య, లావుడ్య పల్లవిరాజునాయక్ జీవన శ్రీ సేవా కోరిక గులాబీ సింగ్ రవినాథ్ రాందాస్ ఆకాష్ ఇన్స్టిట్యూట్ మేనేజ్మెంట్ డైరెక్టర్ మహేశ్వరి లక్ష్మణ్ నాయక్ సుగుణ జములాల్ నితిన్ ఉదయ్ శ్రీ పవన్ భారతి బాయ్ మహావీర్ సింగ్ రాజన్న వంశీ మాజీ సర్పంచ్ జగన్ నాయక్ పోలీస్ డిపార్ట్మెంట్ కేతావత్ నాయక్ శంకర్ పోరిక సరిత సంతోష్ కుమార్, సంజీవ్ పరశురాం నాయక్ వరంగల్ జిల్లా కోర్టు గవర్నమెంట్ బిపి హెల్త్ డిపార్ట్మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ దంపతుల కుమారుడు, కుమార్తె వేడుకల్లో పాల్గొన్నారు అదేవిధంగా ఈ వేడుకకు పాల్గొన్న ప్రతి ఒక్కరికి పి పి ధన్యవాదాలు తెలిపారు.

### అక్రమ నిర్మాణాలకు అనుమతులు ఇచ్చిన

# అధికారులపై చర్యలు తీసుకోవాలి

**అక్రమ నిర్మాణాలలో ప్రమేయం ఉన్న అధికారుల ఆస్తులపై విచారణ చేయాలి**

**రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మొగుళ్ళ భద్రయ్య ఆధ్వర్యంలో త్వరలో సమగ్ర రిపోర్టు ప్రభుత్వానికి అందజేస్తాం**

**ఎన్ హెచ్ ఆర్ సి రాష్ట్ర కమిటీ సభ్యులు బొమ్మిడాల మురళి**



**రామాయంపేట (మెదక్ జిల్లా):** రాష్ట్రంలో అనేక చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూములలో వెలసిన అక్రమ నిర్మాణాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టడం అభినందనీయమని జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్ హెచ్ ఆర్ సి) రాష్ట్ర కమిటీ సభ్యులు బొమ్మిడాల మురళి అన్నారు. రాష్ట్రంలోని చెరువులు, కుంటలు, నాళాలు, ప్రభుత్వ భూములలో అక్రమ నిర్మాణాలకు అనుమతి ఇచ్చిన అధికారులపై తక్షణ చర్యలు తీసుకోవాలని, వారి ఆస్తులపై విచారణ జరిపి అక్రమాస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్ హెచ్ ఆర్ సి) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మొగుళ్ళ భద్రయ్య ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వానికి త్వరలో సమగ్ర రిపోర్టు అందజేస్తామని బొమ్మిడాల మురళి అన్నారు. అక్రమ నిర్మాణాలపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రతి ఒక్కరు అభినందించాలని, ప్రభుత్వ ఆస్తులను, ప్రజల ఆస్తులను రక్షించాలని రాష్ట్ర ప్రజలకు సూచించారు.

### పేదల ఇండ్లను కూల్చివేస్తే

# ఊరుకునేది లేదు..

**ప్రభుత్వ భూములు కబ్జా పెట్టిన బడా బాబులెవరో తేల్చకుండా పేదోళ్ళని టార్గెట్ చేస్తారా!**

**మున్సిపాలిటీ ఫ్లోర్ లీడర్ అజయ్ సారథి**




**తొలి సమయం మహబూబాబాద్, సెప్టెంబర్ 24:** భూములు ఎలా మాయమయ్యాయి అనే శ్వేత పత్రం విడుదల చేయకుండా మున్సిపాలిటీ పరిధిలోని పేదోళ్ల గుడిసెలను కూలగొడితే ఊరుకోమని సిపిఐ ఫ్లోర్ లీడర్ అజయ్ సారధి అన్నారు. మున్సిపాలిటీ కేంద్రంలోని పేదోళ్ల గుడిసెలను కూలగొట్టడం అన్యాయం అంటూ సిపిఐ ఆధ్వర్యంలో స్థానిక రెవెన్యూ కార్యాలయం ముందు ధర్నా చేసారు, ఈ సందర్భంగా అజయ్ సారధి మరియు సిపిఐ మహిళా నాయకురాళ్లు మాట్లాడుతూ.. బడాబాబులు అక్రమంగా కట్టుకున్న ఇండ్లను ముందు కూల్చండి. ముందుగా ప్రభుత్వ భూములు ఎలా మాయమయ్యాయి ఒక శ్వేత పత్రం విడుదల చేయండి అన్నారు.. పేదల జోలికి పోకుండా ఆక్రమణ ప్రభుత్వ భూములను రికవరీ చేస్తామన్న ప్రభుత్వం నిరుపేదలైన 80 గజాల్లో గుడిసెలు కట్టుకున్న వారి ఇండ్లను కూల్చివేయడం అన్యాయం అన్నారు. ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు.. ఈకార్యక్రమం లో సుమారు 50మంది పాల్గొన్నారు

# జన్మ దిన వేడుకలో అనాధ పిల్లలకు, పెన్నులు పుస్తకాలు, అందించిన ఎస్ ఐ గంద్రతి సతీష్

**తొలి సమయం మహబూబాబాద్ సెప్టెంబర్ 24:** కురవి మండల ఎస్సై జన్మదినం సందర్భంగా జిల్లా కేంద్రంలోని దైవ కృప అనాధ శరణాలయంలో, కేక్ కట్ చేసి స్వీట్స్ పంచిపెట్టారు పిల్లలకు కావల సిన నిత్యావసర వస్తువులు మరియు నోట్స్ పుస్తకాలు పండ్లు అందించారు.. సికింద్రాబాద్ తండాలోని అనాధ ఆశ్రమంలోని వృద్ధులకు కడుపునిండా భోజనం కల్పించి దయాగుణాన్ని చాటుకున్నారు. అదేవిదంగా జిల్లా కేంద్రంలోని పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో నరేష్, పవన్ సోమన్న సుధాకర్ వీరేందర్ తదితర మిత్ర బృందం పాల్గొన్నారు.



# కేటీఆర్‌తో కలిసి బీఆర్ఎస్ ప్రముఖులతో సమావేశమైన ఎంపీ రవిచంద్ర





**తొలి సమయం హన్మకొండ, సెప్టెంబర్ 24**
భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)కార్యనిర్వాహక అధ్యక్షులు కే.టీ.రామారావు,పార్టీకి చెందిన బీసీ ప్రముఖులతో సమావేశామైన పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర తమిళనాడులో బీసీల సంక్షేమం, సముద్ధరణకు అమలవుతున్న పథకాలు,కార్యక్రమాల అధ్యయనానికి పార్టీకి చెందిన బీసీ నాయకులు త్వరలో ఆ రాష్ట్రంలో పర్యటిస్తారు.ఈ సందర్భంగా కేటీఆర్ మంగళవారం తెలంగాణ భవన్ లో బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర, శాసనమండలిలో బీఆర్ఎస్ పక్ష నాయకులు సిరికొండ మధుసూదనాచారి, మాజీ మంత్రులు జోగు రామన్న,వీ.శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీ ఎల్.రమణ, మాజీ ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, బూడిద భిక్షమయ్య గౌడ్ తదితరులతో భేటీ అయ్యారు.బీసీ నాయకులతో కేటీఆర్ పలు అంశాలపై లోతుగా చర్చించారు,పలు సూచనలు చేశారు.ఈ సమావేశంలో తెలంగాణ బీసీ కమిషన్ మాజీ సభ్యులు జూలూరు గౌరీశంకర్, ఆంజనేయులు గౌడ్,శుభప్రద పటేల్, ఉపేంద్రాచారి,కిశోర్ గౌడ్, నాయకులు చిరుమళ్ల రాకేష్,గెల్లు శ్రీనివాస్ యాదవ్, రాజారాం యాదవ్, రవీందర్ సింగ్,ఆలకుంట హరి,వొడపల్లి మాధవ్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

# విలేకరిపై దాడిని ఖండిస్తున్నాం

### సిపిఐఎల్ మాస్ లైన్ ప్రజాపంథా పార్టీ డివిజన్ నాయకుడు కొండచరణ్

**తొలి సమయం చర్ల/ సెప్టెంబర్ 24**
చర్ల లో గత మూడు రోజుల క్రితం మత్తు పదార్థాలు నివారించాలని మత్తు పదార్థాలు సేవించి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్న యువతను కాపాడాలని మత్తుపదార్థ రహిత సమాజాన్ని ఏర్పాటు చేయాలని వార్త రాసినందుకు ప్రజాజ్యోతి విలేఖరి అలవాల సతీష్ ఇంటిపై గుర్తుతెలియని దుండగులు, ఆకతాయిలు, రౌడీ మూకల్లా రాళ్లదాడి చేయడాన్ని , ఫోన్లు చేసి బెధిరించడాన్ని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీగా తీవ్రంగా ఖండిస్తున్నామని, ఇటీవలకాలంలో చర్ల మండలంలో అక్రమాలకు పాల్పడుతున్న అక్రమార్కులు ప్రశ్నించిన వారిని బెదిరించడం విలేకరులపై సైతం దాడులు చేయడం పరిపాటిగా సర్వసాధారణంగా మారింది ఇది సమాజ గమనానికి అత్యంత ప్రమాదకరం ప్రశ్నించేవారిని, మంచిని చెడుని సమాజం ముందుకు తీసుకువచ్చి ప్రజలకి తెలియజేసే పాత్రికేయులను దాడులు చేయడం ద్వారా బెదిరించడం ద్వారా నియంత్రించాలని అనుకోవడం దుర్మార్గం అని సిపిఐ ఎంఎల్ ప్రజాపందా ప్రతి డివిజన్ కార్యదర్శి కొండ చరణ్ అన్నారు. మంచి కోసం తమ కలాన్ని గలాన్ని వినిపించే విలేకరి మిత్రులకు సిపిఐ ఎంఎల్ ప్రజాపందా పార్టీ నిరంతరం అండగా ఉంటుందని విలేఖరి మిత్రులు ఈ విషయమై చేసే ప్రతి కార్యక్రమానికి పార్టీ సహాయ సహకారాలు ఉంటాయని విలేకరి మిత్రులు వైరుధ్యాలను భేదాభిప్రాయాలను వీడి ఐక్యంగా ముందుకు సాగాలి ఈ ఘటనను ప్రజలు ప్రజాస్వామ్యవాదులు ప్రతి ఒక్కరూ ఖండించాలని, గౌరవ పోలీసు వారు ఈ విషయమై తక్షణమే విచారణ చేసి సదరు దుండగులను గుర్తించి వారిపై చట్టపరమైన కట్టిన చర్యలు తీసుకోవాలని మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజా పంథా పార్టీ డివిజన్ నాయకులు కొండాచరన్ కోరారు .



# డా. కొల్లూరి చిన్నాకు మరో అరుదైన గౌరవం

### - డేస్ప్రింగ్ థియోలాజికల్ యూనివర్సిటీ - టెక్సాస్ (యూఎస్ఏ) చే గౌరవ డాక్టరేట్ అవార్డు కు ఎంపిక








**తొలి సమయం పెడన, సెప్టెంబర్ 24**
పెడన పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు అఖిల భారత ఆర్యవైశ్యుల పరిరక్షణ సమితి (ఆప్స్) వ్యవస్థాపకులు కొల్లూరి చారిటబుల్ ట్రస్ట్ (కెసిటి) వ్యవస్థాపకులు పెడన పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులుడా. కొల్లూరి చిన్నా కు మరో అరుదైన గౌరవం దక్కింది.డేస్ప్రింగ్ థియోలాజికల్ యూనివర్సిటీ టెక్సాస్ (యూఎస్ఏ) చే గౌరవ డాక్టరేట్ అవార్డు కు ఎంపికయ్యారు. ఈ అవార్డును సెప్టెంబర్ 29న ఆదివారం విశాఖపట్నం, జిల్లా పౌర గ్రంథాలయంలో డేస్ప్రింగ్ థియోలాజికల్ యూనివర్సిటీ నిర్వహించనున్న అవార్డుల ప్రధానోత్సవం కార్యక్రమంలో డా. కొల్లూరి చిన్నా గౌరవ డాక్టరేట్ అవార్డును అందుకోనున్నారు. గత నాలుగు దశాబ్దాలు పైగా పెడన

పట్టణ,పరిసర ప్రాంత పేద ప్రజలకు తన సొంత నిధులతో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకు గాను డేస్ప్రింగ్ థియోలాజికల్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ అవార్డుల ప్రధాన కమిటీ ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ, కృష్ణా జిల్లా ఆర్యవైశ్య సంఘం పెడన మండల ఆర్యవైశ్య సంఘం, పెడన పట్టణ ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య యువజన

సంఘం, వాసవి క్లబ్, శ్రీ వాసవి మహిళా మండలి, పెడన మండల హెూల్ సేల్ అండ్ రిటైల్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ ప్రతినిధులతో పాటు పట్టణ పుర ప్రముఖులు పలువురు గౌరవ డాక్టరేట్ అవార్డు గ్రహీత డా. కొల్లూరి చిన్నా కు అభినందనలు తెలియజేశారు.



**తొలి సమయం కరీంనగర్ సెప్టెంబర్ 24**

## చికిత్స పొందుతున్న బీసీ ఆజాది యూత్ ఫెడరేషన్

# జాతీయ అధ్యక్షులు జక్కని సంజయ్ కుమార్

### - ఆమరణ దీక్ష తరువాత క్షీణించిన ఆరోగ్యం - కరీంనగర్ సీసీవీఎం ఆస్పత్రిలో చేర్చిన కుటుంబ సభ్యులు


బీసీల డిమాండ్ల పరిష్కారం చేయాలని, కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలని, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతానికి వాటా పెంచాలని డిమాండ్ చేస్తూ ఆమరణ దీక్ష చేసిన బీసీ ఆజాది యూత్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు జక్కని సంజయ్ కుమార్ ఆరోగ్య పరిస్థితి బాగోలేక కరీంనగర్ పట్టణంలోని సీవీవీయం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వివరాల్లోకి వెళితే కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలైన సంవత్సరానికి 20వేల కోట్ల రూపాయల బడ్జెట్ కేటాయింపులు చేస్తామని హామీ ఇచ్చి అమలు చేయకుండా మోసం చేశారని, అధికారంలోకి వచ్చిన వెంటనే కూలగణన చేపడుతామని చెప్పి 10 నెలలు అవుతున్న ఇంకా ఆ ప్రక్రియ మొదలు పెట్టాలేదని, స్థానిక సంస్థలలో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చారని కానీ ఆ ప్రక్రియ మొదలు కాకుండానే ఎన్నికల కమిషన్ ఎన్నికల పని చేస్తున్న క్రమంలో బీసీలకు ఇచ్చిన హామీల అమలు చేయకుండా ఎన్నికలకు పోవద్దని వెంటనే కుల గణన ప్రారంభించాలని, బీసీ రిజర్వేషన్లు పెంచాలని ఆగస్టు 25న మాజీ బీసీ కమిషన్ చైర్మన్ బీపీ మండల్ జయంతి సందర్భంగా హైదరాబాద్ లోని బీసీ ఆజాది యూత్ ఫెడరేషన్ కేంద్ర కార్యాలయంలో ఆమరణ దీక్ష చేపట్టి 9 రోజులు చేసిన పిదప రాష్ట్ర ప్రభుత్వం స్పందించి బీసీ కమిషన్ ఏర్పాటు చేసింది.జాతీయ కాంగ్రెస్ కమిటీ స్పందించి పీసీసీ చీఫ్ గా కూడా బీసీ సామాజిక వర్గానికి చెందిన మహేష్ కుమార్ గౌడ్ కు అవకాశం కల్పించింది. ఈ క్రమంలో సంజయ్ కుమార్ ప్రభుత్వ పెద్దల, బీసీ సంఘాల నాయకుల చేత నిమ్మరసం తాగి దీక్ష విరమించారు. గత కొద్ది రోజులుగా ఆయన ఆరోగ్య పరిస్థితి బాగోలేక కుటుంబ సభ్యులు కరీంనగర్ జిల్లా కేంద్రంలోని సీవీవియం ఆస్పత్రిలో చేర్చారు, వైద్యులు చాట్ల శ్రీధర్ పర్యవేక్షణలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

# ఓటర్ నమోదు కార్యక్రమం కట్టుదిట్టంగా నిర్వహించాలి

**ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి**

**స్పెషల్ సమ్మరీ రివిజన్, ఈ.ఆర్.ఓ .నెట్ 2.0 పై జిల్లా కలెక్టర్ లతో వీడియో సమావేశం ద్వారా సమీక్షించిన సీఈఓ**




**తొలి సమయం హన్మకొండ,సెప్టెంబర్ 24**
రాష్ట్రంలో ఓటర్ నమోదు కార్యక్రమం కట్టుదిట్టంగా నిర్వహించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి తెలిపారు. మంగళవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి, స్పెషల్ సమ్మరీ రివిజన్, ఈ.ఆర్.ఓ నెట్ 2.0 పై జిల్లాల కలెక్టర్ లతో వీడియో సమావేశం నిర్వహించి సమీక్షించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ ప్రావిణ్య ఈ వీడియో సమావేశంలో పాల్గొన్నారు.వీడియో కాన్ఫరెన్స్ లో రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ గత వారం రోజులుగా నూతన ఓటర్ నమోదు పై చేపట్టిన ఇంటింటి సర్వే పని తీరు చాలా మెరుగుపడిందని, ఇప్పటి వరకు 90 శాతం పైగా ఇంటింటి సర్వే పూర్తయిందని, సెప్టెంబర్ 28 నాటికి 100% ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో బూత్ స్థాయి అధికారుల ద్వారా ఇంటింటి సర్వే పూర్తి చేయాలని అన్నారు. పెండింగ్ ఉన్న ఓటర్ నమోదు సంబంధించి ఫారం 6, ఫారం 7, ఫారం 8 దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయాలని సీ.ఈ.ఓ ఆదేశించారు. సెప్టెంబర్ నెలాఖరు వరకు పెండింగ్ దరఖాస్తులు పూర్తి చేయాలని అన్నారు. ఇతర ప్రాంతాలకు తరలి వెళ్ళిన వారి వివరాలు నోటీసు జారీ చేసి నిర్దేశిత ప్రోసిడ్యూర్ ఫాలో అయిన తరువాత తొలగించాలని అన్నారు.ఇంటింటి సర్వే లో ఆధార్ నెంబర్ సేకరణ తప్పనిసరి కాదని , ఓటర్లు ఇష్టం ఉంటే ఇవ్వవచ్చని, బలవంతం చేయరాదని అన్నారు. ఇంటింటి సర్వే సంబంధించి వచ్చిన నూతన ఓటర్ నమోదు దరఖాస్తుల వివరాలు, నూతన ఓటర్ల నమోదు సంబంధించిన అంశాలు రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలియజేయాలని అన్నారు. నూతన ఓటరు కార్డుల ముద్రణకు సంబంధించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాలని, బూత్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు సమర్పించాలని, పోలింగ్ కేంద్రం లోకేషన్, ఫోటోలను బి.ఎల్.ఓ యాప్ లను అప్ లోడ్ చేయాలని అన్నారు. బి.ఎల్.ఓ యాప్ వినియోగం పై బూత్ స్థాయి అధికారులకు అవసరమైన శిక్షణ అందించాలని అన్నారు. పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ ప్రక్రియ డ్రాఫ్ట్ ఓటరు జాబితా ప్రచురణ అక్టోబర్ 29 ముందు పూర్తి చేయాలని సీఈఓ అధికారులను ఆదేశించారు. మెదక్ –నిజామాబాద్ –అదిలాబాద్ –కరీంనగర్ జిల్లాల గ్రాడ్యుయేట్స్, టీచర్లు, ఖమ్మం నల్గొండ జిల్లాల టీచర్ల శాసనమండలి సభ్యుల నియోజకవర్గ స్థానాలకు ఎన్నిక కోసం సెప్టెంబర్ 30న , పబ్లిక్ నోటీస్ జారీ చేసి ఓటర్ నమోదు చేయడం జరుగుతుందని అన్నారు. గతంలో ఓటు హక్కు వినియోగించుకున్న వారు సైతం మరోసారి తప్పనిసరిగా ఓటు హక్కు నమోదు చేసుకోవాల్సి ఉంటుందని, ఈ అంశాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని అన్నారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి , రెవెన్యూ డివిజన్ అధికారులు వెంకటేశ్వర్లు, నారాయణ లు, తహసిల్దార్ లు, తదితరులు పాల్గొన్నారు.

## నూతన జిల్లా విద్యాధికారిని గౌరవంగా సత్కరించిన బీసీ ఉద్యోగుల సంఘం



**తొలి సమయం మహబూబాబాద్ సెప్టెంబర్ 24:**
జిల్లా నూతన విద్యా విద్యాధికారిని జిల్లా బీసీ ఉద్యోగుల సంఘం గౌరవంగా కలిసి ఘనమైన సత్కారం చేశారు.. ఈ సందర్భంగా తెలంగాణ బీసీ ఉద్యోగుల సంగం జిల్లా అధ్యక్షులు దొంతోజు ఓంకారం మరియు జిల్లా ప్రధాన కార్యదర్శి గునుగంటి శ్రీనివాస్ లు మాట్లాడుతూ విద్యారంగ సమస్యలను ఏకరవు పెట్టారు ఈ కార్యక్రమంలో సంఘ గౌరవ పీజీహెచ్ఎం పూజారి వీరయ్య, జిల్లా కార్యవర్గ తూటి వెంకటేశ్వర్లు, సునీత మమత మహబూబాద్ మండల అధ్యక్షులు రఫిక్ కురవి మండల బాధ్యులు మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## హెచ్ఇఓ ఒబిలి ఒబిలి శెట్టి రామకృష్ణ బదిలీ వీడ్కోలు కార్యక్రమం

**హెచ్ఈఓ రామకృష్ణ తన ఉద్యోగాన్ని అంకిత భావంతో నిర్వహించారు**

**జిల్లా వైద్య, ఆరోగ్యఅధికారి డాక్టర్ మురళీధర్**



**తొలి సమయం మహబూబాబాద్ సెప్టెంబర్ 24:**
8 సంవత్సరాలుగా పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెచ్ఈవోగా పనిచేస్తున్న ఒబిలి శెట్టి రామకృష్ణ బదిలీ అయ్యారు. బదిలీలో భాగంగా జూలై 29వ తారీకు మహబూబాబాద్ డిఎం %ఒ% హెచ్ ఓ సబ్ యూనిట్ ఆఫీసర్ ఈరోజు ఆయనకు వీడ్కోలు సమావేశం జరిగింది ఈ సమావేశానికి వైద్య జిల్లా అధికారి డాక్టర్ విజయ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి డాక్టర్ మురళీధర్ మాట్లాడుతూ.. హెచ్ ఇ వో గా రామకృష్ణ డెడికేషన్ సంపూర్ణంగా ఉన్నది అని కొనియాడారు..ఏ పని ఒప్ప చెప్పినా సకాలంలో పూర్తిచేసేవారు అన్నారు, అందరినీ సమన్వయ పరుస్తూ.. తాను ముందుండి నడిపించే వారని అన్నారు. ప్రతి జిల్లా ప్రోగ్రాంలో ఆయన మార్కు ఉండేదని అన్నారు అతను మీ నుండి దూరమైన బాధ మీకు మిగిల్చినా మాకు దగ్గరైతూ సంతోషాన్ని కలిగిస్తున్నారని హాస్యం పండించారు. రామకృష్ణ బదిలీ ఫేర్వెల్ పార్టీకి రావడం నాకు ఆనందాన్ని ఇస్తుందన్నారు ఈ కార్యక్రమంలో ఎం సి హెచ్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సారంగపాణి డీఈవో లక్ష్మీనారాయణ ఎన్ సి వి డి సి ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సుధీర్ రెడ్డి డీఎస్ఓ డాక్టర్ విజయ్ సికిల్ సెల్ ప్రోగ్రాం ఆఫీసర్స్ శ్రావణ్ కుమార్ పి హెచ్ ఎన్ సుభాషిని పిడిఏమోలు ఎంఎల్ హెచ్ పి లు హెడ్ కోటర్ స్టాఫ్ సూపర్వైజర్లు, సిస్టర్లు మరియు ఆశాలు పాల్గొనడం జరిగింది.



## నిజాయితీగా ప్రజలకు సేవలందించాలి

**వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**

**తొలి సమయం, వరంగల్,సెప్టెంబర్ 24**
వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్కు వచ్చే ప్రజలకు నిజాయితీగా సేవలందించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సూచించారు. ఇటీవల శిక్షణ పూర్తిచేసుకొని వరంగల్ పోలీస్ కమిషనరేట్ కు కేటాయించబడిన 19 మంది నూతన ట్రైన్ ఎస్సైలు బుధవారం వరంగల్ పోలీస్ కమీషనర్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ ముందుగా విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకొన్న సబ్ ఇన్స్పెక్టర్లను అభినందించారు. అనంతరం పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రజలకు ప్రత్యక్షంగా సేవలందించే అవకాశం కేవలం పోలీసులకు మాత్రమే ఉంటుందని అలాంటి పోలీసు ఉద్యోగాల్లో చేరినందుకు ప్రతి ఒక్కరూ గర్వపడాలని. ప్రజలకు సేవలందిస్తూ పోలీస్ శాఖకు కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని పోలీస్ కమిషనర్ సూచించారు

## విలేకరిపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం

**సీనియర్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు జవ్వాదిమురళి**

**తొలి సమయం చర్ల, సెప్టెంబర్ 24**
చర్ల మండలంలో మూడు రోజుల క్రితం గంజాయి వాడకంపై యువత తప్పుదోవ పడుతుందనే ఉద్దేశంతో ప్రజా జ్యోతి విలేకరి అలవాల సతీష్ కథనం రాయడం జరిగినది ఆ కథనం వచ్చిన వెంటనే కొంతమంది దుండగులు ఆ విలేకరిని బెదిరించటం జరిగినది దానిలో భాగంగా సోమవారం రాత్రి ప్రజా జ్యోతి విలేఖరి యొక్క ఇంటి మీద రాళ్ల దాడి చేయడం జరిగింది .ఇలా పత్రికా విలేకరి మీద దాడి చేయడానికి అందరూ తీవ్రంగా ఖండించారు. ఈ దాడిని ఖండిస్తూ సీనియర్స్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో చర్ల పోలీస్ ఎస్ఐ కి అలాగే చర్ల తాసిల్దార్ కి దాడికి సంబంధించిన వినతి పత్రం ఇవ్వడం జరిగింది. దాడి చేసిన బాధ్యుల పైన చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా కోరడం జరిగింది విలేకరుల మీద దాడులు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం అంబేద్కర్ సెంటర్ వద్ద పత్రిక విలేకరిపై జరిగిన దాడిని ఖండిస్తూ ప్లకార్డ్సు ప్రదర్శన చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో సీనియర్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు జవ్వాదిమురళి , సీనియర్ విలేకరులు ప్రభుదాస్ ,రమణారావు ,ఋషి విలేకరులు అందరూ పాల్గొన్నారు.

